క్లుప్తంగా

ఉచితంగా షిరిడీ బస్సు యాత్ర

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన శ్రీఅభయ సాయి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు ఉచిత షిరిడీ యాత్ర బస్సులను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు ఆదివారం ప్రారంభించారు. సంస్థ నిర్వాహకులు ఎల్‌బీఐ రామ్మూర్తిరెడ్డి, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌కు గడ్డర్లు



భారీ క్రేన్ల సాయంతో గడ్డర్లు అమరుస్తున్న దృశ్యం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని కలెక్టరేట్ వద్ద సాగుతున్న చెన్నై–బెంగళూరు హైవే పనుల్లో భాగంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌కు ఆదివారం గడ్డర్లు ఏర్పాటు చేశారు. వంతెనపై వాటిని అమరుస్తున్న సమయంలో ట్రాఫిక్‌ను కాసేపు క్రమబద్ధీకరించారు.

నేడు కార్పొరేషన్‌లో 'గ్రీవెన్స్'

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమ్యలపై వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్వీ అరవింద్ ఐ ఆస్పత్రి సహకారంతో చేపట్టిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 179 మందికి కంటి పరీక్షలు చేయగా 98 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వారికి అన్ని వసతులను ఉచితంగా కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్ జైన్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, రేవంత్, కమలేష్ తదితరులున్నారు.

ఘనంగా భరణి ఉత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం చెంగాల్రాయ కొండపై వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం భరణి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూలస్థానంలోని స్వామికి అభిషేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కావళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు.

దేశమ్మ ఆలయానికి తాత్కాలిక కమిటీ

నగరి: నేత్ర ప్రదాయిని దేశమ్మ దేవాలయానికి తాత్కాలిక కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు బాధ్యతలను స్వీకరించారు. నూతన కమిటీ సభ్యులు మురళి, వీకేఎస్ వాసు, మదన్‌కుమార్, వెంకటాచలం, సుబ్బరాయుడులను పలువురు దుశ్శాలువాలతో సత్కరించారు. ఆడినెల ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆలయ ఈఓ సభ్యులను కోరారు. స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించితే అనర్థం

వ్యవసాయంలో పురుగు మందుల వినియోగం బాగా పెరిగిపోతోంది. పంటల సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తే అనర్థాలే ఎక్కువగా ఉంటాయని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. తరచూ రైతులకు సూచనలు అందిస్తున్నా మందుల పిచికారీలో మాత్రం జాగ్రత్తలు పాటించడంలేదు. దీనివల్ల ప్రతి సంవత్సరం పంటల దిగుబడి తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా ఎక్కువతున్నాయి. ఇలా చేస్తే ఖర్చులు వృథా తప్ప ఎలాంటి లాభం లేదన్న విషయాన్ని రైతులు తెలుసుకోవడం లేదు. ఆయా పంటలను ఆశించే తెగుళ్లను నివారించేందుకు రైతులు విచ్చలవిడిగా ఎరువులు, పురుగుల మందులు వినియోగిస్తున్నారు.

–ఐరాల



వరి పైరుకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు



సాగులో ఉన్న వరి పంట

- అతిగా వాడుతున్న రసాయన ఎరువులతో ముప్పు
- విషతుల్యమవుతున్న ఆహార పదార్థాలు
- పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు
- రక్షణ పరికరాలు లేకుండా పిచికారీ చేస్తే రైతులకు ప్రమాదం

మార్కెట్లో వస్తున్న కొత్త రకం ఎరువులు, పురుగుల మందులను తక్కువ ధరలకు అందిస్తుండడంతో రైతులు తీవ్రంగా మోసపోతున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోకుండా మందులను వాడుతుండడంతో పురుగుల నివారణ ఏమో గానీ ఉన్న పంటలను కోల్పోవాల్సిన దుస్థితి ఎదురవుతోంది. భూసారం తగ్గడంతో పాటుగా భూమిలో ఉన్న మేలు చేసే వానపాముల వంటి జీవులు చనిపోతున్నాయి. పిచికారీ చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

పంటసాగు చేసే సమయంలోనే రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి. కొంతమంది రైతులు భూసార పరీక్షలు చేయించకుండానే పంటలు వేస్తున్నారు. ఆపై వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా నష్టపోవాల్సి వస్తోంది. అలా కాకుండా వ్యవసాయాధికారుల సూచనల మేరకు భూసార పరీక్షలు చేయించి ఆపై ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగిస్తే మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం మేలు

సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరగడంతో పాటు దీర్ఘకాలంగా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చు. కొంతమంది రైతులు విరివిగా తమ పంటలకు రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో మొదట పంట దిగుబడి అధికంగా వచ్చినా ఆ తర్వాత క్రమేపీ దిగుబడి తగ్గిపోయి బీడుగా మారిపోతాయి. మోతాదుల్లో మాత్రమే ఎరువులను పంటలకు వినియోగిస్తూ అధిక దిగుబడులు పొందవచ్చు. అధిక ఉష్ణోగ్రత, నీటి ఎద్దడి సమయాల్లో పంటలకు ఎరువులు, పురుగు మందులు చల్లకూడదు. అదేవిధంగా రెండు, మూడు రకాల పురుగు మందులను మిశ్రమంగా చేసి పిచికారీ చేయకూడదు. పంటలకు వ్యాధులు సంకరమించినప్పుడు ఇష్టానుసారంగా కాకుండా ముందుగా వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు వాడాలి. రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకంతో ఆహార పదార్థాలు విషతుల్యమవుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో పర్యావరణానికి మేలు చేకూరి పెట్టుబడి భారం తగ్గుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పురుగుమందు పిచికారీ చేసే సమయంలో రైతులు, కూలీలు బీడీలు, సిగరెట్లు , చుట్టలు తాగకూడదు. కళ్లు, నోరు, ముక్కు, ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా చేతులతో రుద్దరాదు. భోజనం చేసే సమయంలో చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. పిచికారీ చేసే సమయంలో శరీరం కన్పించకుండా దుస్తులు ధరించాలి. వాడిన పురుగుమందు డబ్బాలను దూరంగా పడేయాలి. క్రిమిసంహారక మందులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



రైతులు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు లేకుండా స్ప్రేయింగ్ చేయరాదు. పంటలపై సరైన మోతాదులో క్రిమిసంహారక మందులు వినియోగించాలి. లేకుంటే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

–వరలక్ష్మి, ఏఓ, ఐరాల

ఈఆర్ కార్యాలయం పరిశీలన



కార్యాలయం పరిశీలిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఆర్‌ఓ (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసు)ను ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదివారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయ గదులను గమనించారు. పెచ్చులూడిన పైకప్పు, వేలాడుతున్న విద్యుత్ తీగలను చూశారు. ఈఈ మునిచంద్ర మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మూడు నియోజకవర్గాల నుంచి వినియోగదారులు కరెంటు బిల్లులు కట్టాలంటే ఈఆర్ కార్యాలయానికి వస్తారని తెలిపారు. నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎస్ఈ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీఈలు పద్మనాభపిళ్లై, జ్ఞానేశ్వర్, ఈఆర్‌ఓ ఎస్ఏ గౌతమి పాల్గొన్నారు.

వైభవంగా గురప్ప తిరునాళ్లు

తవణంపల్లె: మండలంలోని అరగొండలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గురప్ప స్వామి జాతర తిరునాళ్లు వైభవంగా నిర్వహించారు. నాయిబ్రాహ్మణలు స్వామికి భక్తిశ్రద్ధలతో పూజాసామగ్రి, ప్రసాదాలను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. గురప్ప స్వామిని మట్టితో ప్రతిమగా తీర్చారు. అనంతరం అభిషేకం, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి పల్లకిలో గురప్పస్వామిని ఊరేగించారు. స్వామివారికి భక్తులు కర్పూర మంగళ హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రేపు వజ్రాలపురంలో ఆడికృత్తిక వేడుకలు



వజ్రాలపురం బోయకొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం ఆడికృత్తిక వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు కృష్ణమూర్తి, విశ్వనాథం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం కావడి మొక్కులు బడి పూజా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సుబ్రమణ్యస్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆడికృత్తిక మహోత్సవ కరపత్ర ఆవిష్కరణ

ఆడికృత్తిక కరపత్రం ఆవిష్కరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ఈశ్వరగుడి వీధిలోని శ్రీఅగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ఆడికృత్తిక మహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. మంగళవారం ఆలయంలోని వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామికి ఆడి పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు విశేష ద్రవ్యాలతో అభిషేకం, 9 గంటలకు అలంకరణ, మహాహారతి, తీర్థ ప్రసాద వినియోగం , 11 గంటలకు ఊరేగింపు జరుగుతుందని అర్చకులు శివ తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొన్ని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వేగం కంటే ప్రాణం ముఖ్యం



వాహనం తనిఖీ చేస్తున్న ఎస్ఐ జయప్ప

విజయపురం: వేగం కంటే ప్రాణం ముఖ్యమని ఎస్ఐ జయప్ప అన్నారు. ఆదివారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కారు, ఆటో, స్కూటర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. సీటు బెల్ట్, హెల్మెట్ లేకుండా వాహనం నడపకూడదని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. అతి వేగం కారణంగా తరచూ రోడ్డు ప్రమాదం జరుగుతున్నాయని గుర్తు చేశారు. రోడ్డు నిబంధనను పాటించడంతోపాటు వాహనానికి సంబంధించిన రికార్డు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా, మైనర్లకు బండి ఇచ్చిన కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఐఎఫ్‌టీయూలో భారీగా చేరికలు

చిత్తూరు కార్పొరేషన్: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)లో ఆదివారం పలు సంఘాల నేతలు చేరారు. ముఖ్యంగా సుమారు 40 ఏళ్లుగా జిల్లా కమ్యూనిస్టు పార్టీలో పని చేసిన చైతన్య సైతం ఐఎఫ్‌టీయూలో చేరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జరిగిన చేరిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. ఉద్యోగ, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని తెలిపారు. పలు ఫ్యాక్టరీల్లో కార్మికచట్టాలు అమలు కావడం లేదన్నారు. పోరాటాలతో హక్కుల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. ఐఎఫ్‌టీయూలో చేరిన వారిలో గుడిపాలలోని ఫుడ్ బేవరేజెస్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు అన్బు, కార్యదర్శి వెంకటేష్ కోశాధికారి రమేష్, ఐటీసీ ట్యాంకర్స్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు అన్సర్, చిత్తూరు రూరల్ మండలంలోని గ్రావిటా ఇండియా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి దినేష్, ఉపాధ్యక్షులు మైకేల్, నవీన్, సహాయ కార్యదర్శి ప్రశాంత్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు క్యాజువల్ స్వీపర్స్ యూనియన్ అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి రాజేష్, కోశాధికారి రాము, మధ్యాహ్నం భోజనం కార్మిక యూనియన్ అధ్యక్షులు రూబీ సెల్వి, బుజ్జి, చింతపండు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, మున్నాతో పాటు దాదాపు 50 మంది ఉన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపునేని హరికృష్ణ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.



ఐఎఫ్‌టీయూలో చేరిన కార్మిక సంఘాల నేతలు

కావళ్ల పండుగ

ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భరణి కావళ్ల పండుగ నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్ష పాటించి సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి విశేష పూజలు చేశారు. మండలంలోని బసవాపల్లె, ముత్తువాళ్లూరు, గుడిపాల, ముట్టుకూరు పల్లె, పాపసముద్రం, అడవిచేను గ్రామాల్లోని ఆలయాల్లో షణ్ముఖునికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. హరోంహర స్మరణలతో వీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి కందగిరి, వళ్లిమలైకు వెళ్లి మురుగన్ సన్నిధిలో కావళ్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. –గుడిపాల





మహాభారత ఉత్సవాల ముగింపు

వెదురుకుప్పం: పచ్చికాపల్లం గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణి భారతి హరకథ కాలక్షేపం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం అలరించింది. కళాకారులు చేసిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. తదుపరి ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు కంకణధారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. దుర్యోధన వధ కార్యక్రమానికి పచ్చికాపల్లం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నేత బోడిరెడ్డి నరేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవాల సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు వైఎస్ఆర్ సీపీ నేత అనగంటి హరికృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. నేతలు ఆయన్ను సాదరంగా స్వాగతించి ఘనంగా సత్కరించారు. వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆనంద్ సౌండ్స్ ఆధ్వర్యంలో విద్యుద్దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పదివేలు కట్టు- రోజుకు వెయ్యిపట్టు!

- పలమనేరులో డబ్బులు పోగొట్టుకుంటున్న జనం
- రకరకాల ఎర్నింగ్ యాప్‌లతో మోసాలు
- అప్పులపాలై కనిపించకుండా పోతున్న యువకులు
- డాయ్ యాప్ కాదు మరెన్నో యాప్‌లతో మోసాలు

పలమనేరు: పదివేలు ఆన్‌లైన్‌లో డిపాజిట్ చేస్తే మన డబ్బు మనకిస్తూ రోజుకు వెయ్యి సంపాదించవచ్చునే దురాశ దుఃఖానికి చేటులా మారింది. సులభంగా డబ్బులు సంపాదించవచ్చునే దురాశతో జిల్లాలో పలువురు వేలకు వేలు పోగొట్టుకుని మదనపడుతున్నారు. స్మార్ట్‌ఫోన్‌లో కనిపించే ఈజీ ఎర్నింగ్‌యాప్‌లో మోసాలకు పాల్పడే యాప్‌లపై అవగాహన లేని అమాయకులు, చదువుకున్న వారు సైతం డబ్బులు పోగొట్టుకుని తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే డాయ్ యాప్ కాకుండా ఇతర యాప్‌లోనూ వేలాదిమంది ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి డబ్బులు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది.

ఇదిగో సాక్ష్యం...

పట్టణంలోని బోయవీధికి చెందిన ఖాదర్ ఓఎంజీ యాప్‌లో పదివేలను కడితే రోజుకు వెయ్యి వస్తుందని తన స్నేహితుడు చెబితే నమ్మి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి పర్మిషన్లను ఇచ్చి తన ఫోన్ పే నుంచి వెయ్యి రూపాయలను యాప్ ఖాతాకు జమచేశాడు. దీంతో యాప్‌లో 24 గంటల సమయం కౌంట్ మొదలైంది. అతను డబ్బులు చెల్లించిన 24 గంటలకు అతని ఖాతాలోకి రూ.100 జమ అయ్యింది. మళ్లీ రెండో రోజుకి వంద వచ్చింది. దీంతో రూ.10వేలను జమ చేశాడు. 24 గంటల్లో మరో వెయ్యి వచ్చింది. ఆతర్వాత విత్‌డ్రా ఆప్షన్ ప్రాసెసింగ్ అని డబ్బు రాలేదు. గతవారం రోజులుగా ప్రాసెసింగ్‌లోనే ఉంది. దీంతో వడ్డీకి ఆశపడి డబ్బును పోగొట్టుకున్నాడు. ఇలాగా నమ్మి వేలాదిమంది డబ్బు భారీగా పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది.

కనిపించని యువకులు..

నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన ఓ యువకుడు అక్కడి వైన్ షాపులో సూపర్‌వైజర్. బెట్స్‌లూప్ అనే ఆన్‌లైన్ క్రికెట్ యాప్‌కు అలవాటు పడి లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ యువకుడు కనిపించకుండా పోయాడని తెలుస్తోంది. ఇదేవిధంగా జిల్లాలో కొందరు యువకులు లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. మొత్తం మీద ఈ ప్రాంతంలో కోట్లాది రూపాయలు ఇప్పటికే బెట్టింగ్‌యాప్‌లో కొంప మునిగినట్టు సమాచారం.

దీనికితోడు ఆన్‌లైన్ లోన్‌యాప్‌లు..

ఆధార్‌కార్డుతో రుణాలిస్తామంటూ పదులసంఖ్యలో ఆన్‌లైన్ లోన్‌యాప్‌లు స్మార్ట్‌ఫోన్‌లో దర్శనమిస్తున్నాయి. వీటిని ఇన్‌స్టాల్ చేసి ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను ఇస్తే నిమిషాల్లో రూ.5 వేలనుంచి రూ.10వేల దాకా రుణం మంజూరై మనఖాతాల్లోకి చేరుతోంది. ఇందులో వడ్డీ, ప్రాసెసింగ్ ఫీజు పేరిట రూ.5వేలకు రూ.1500, రూ.10వేలకు రూ.3వేలు పట్టుకుని ఇస్తున్నారు. తీసుకున్న రుణాన్ని వారంలో తీర్చాల్సి ఉంటుంది. దీన్ని తీర్చలేక ఇబ్బందిగా ఉంటే అదే యాప్‌లో మరిన్ని యాప్ యాడ్‌లు కనిపిస్తుంటాయి. పాతలోన్ కోసం మరో యాప్‌లో కొత్తలోన్ తీసుకుని పాతలోన్ తీర్చడం ఇలా నాలుగైదు లోన్లను తీసుకుని వాటిని కట్టేందుకు మళ్లీ అప్పులు చేసి ఇక్కట్లు పడుతున్నవారు ఈ ప్రాంతంలో చాలామంది కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, దినసరి పనులు చేసుకునే కూలీలు, మాల్స్‌లో పనిచేసేవారు, విద్యార్థులు ఎక్కువగా ఆన్‌లైన్ లోన్ల బారిన పడుతున్నారు.



ఆన్‌లైన్ యాప్

వందల సంఖ్యలో ఇలాంటి యాప్‌లు...

స్మార్ట్‌ఫోన్ ప్లేస్టోర్‌లోకి వెళితే ఓఎంజీ, గెట్‌క్యాష్, ఈజీ క్యాష్, ఈజీలోన్, మినిట్‌లోన్, డబుల్, స్పిన్‌టు విన్‌మనీ, బెట్స్‌లూప్ లాంటి ఎర్నింగ్, లోనింగ్ యాప్‌లు వందల్లో దర్శనమిస్తుంటాయి. కొందరు సాఫ్ట్‌వేర్ నిపుణులు ఫేక్ ఐడీల ద్వారా ఇలాంటి యాప్‌లను ప్లేస్టోర్‌లో ఉంచినట్టు తెలుస్తోంది. ఇందులోని యాప్‌లో ఏది అసలైందో ఏది నకిలీనో తెలియక సులభంగా డబ్బు సంపాదించవచ్చునని జనం మొదటికే మోసపోతున్నారు.



బెట్స్‌యాప్‌లో లైవ్ గ్యాంబ్లింగ్


మావీధిలో పదిమంది ఉన్నారు..



ముందు 5వేలు మళ్లీ 10వేలు ఇలా లోన్లు కట్టేకొద్దీ లోన్ అమౌంట్ పెరుగుతుంటుంది. దీని కోసం ఆన్‌లైన్‌లో ఒక్కొక్కరు నాలుగైదు లోన్లు తీసి వాటిని కట్టలేక ఇబ్బంది పడేవాళ్లు మా వీధిలో పదిమందిదాకా ఉన్నారు.ఒక్కసారి ఈ లోన్ల కూపిలోకి దిగితే మళ్లీ అంతే సంగతులు. కొందరు అప్పులు చేసి మరీ ఆన్‌లైన్ అప్పు కడుతున్నారు.

–ముజ్జు, బోయవీధి, పలమనేరు

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



ఆన్‌లైన్‌లో రకరకాల మోసాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. చాలామంది స్మార్ట్‌ఫోన్‌ను కెలుకుతూ ఇలాంటి యాప్‌లతో మోసపోతుంటారు. అమాయకులే కాదు చదువుకున్న విద్యార్థులు సైతం మోసపోతున్నారు. ఇలాంటి వాటిని నమ్మరాదని చెబుతూనే ఉన్నాం. అయినా దురాశకు వెళ్లి మోసపోయి బాధపడితే ఏం లాభం.ప్రజలు ఇలాంటి మోసాలపై జాగ్రత్తగా ఉండాలి.

–చంద్రశేఖర్, సీఐ, పలమనేరు